క్లుప్తంగా

క్రిస్మస్ ఉత్సవాలు ప్రారంభం



మంగళగిరి: పట్టణంలోని పార్కురోడ్డులో గల సైమన్ మెమోరియల్ ప్రేయర్ హాల్ ప్రాంగణంలో జరగనున్న క్రిస్మస్ ఉత్సవాల ఆహ్వాన పత్రికలను పలువురు ప్రతినిధులు, అధికారులు ఆవిష్కరించారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో ఏపీ పద్మశాలీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ కె.శకుంతల, క్రైస్తవ ఆధ్యాత్మిక ప్రముఖులు ప్రొఫెసర్ కొడాలి విజయ్‌కుమార్, పాస్టర్లు కొదమల రవి కుమార్, కె.కె.రవికుమార్, కె.రూఫస్, సిస్టర్లు జూడిత్, విక్టోరియా జూడిత్ పాల్గొన్నారు.

15న కుంచనపల్లిలో ఉచిత వైద్య శిబిరం

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి నందు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు మానవ సేవా సంస్థ వ్యవస్థాపకులు వంగర సురేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కుంచనపల్లిలోని రామ్‌స్నేహ ఎవన్యూ అపార్ట్‌మెంట్‌లో ఈ వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నామని, ఈ శిబిరంలో లక్ష్మి కంటి పరీక్షా కేంద్రం కంటివైద్యులు, జనరల్ వైద్యులు, డయాబెటిక్ వైద్యులు డాక్టర్ నిఖిల్, మరియు దంతవైద్యులు డాక్టర్ కె.శ్రీకర్‌లు తమ సేవలను అందించనున్నారని, వైద్యులు ఉచిత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేస్తారని, ఈ అవకాశాన్ని కుంచనపల్లి పరిసర ప్రాంత వాసులు వినియోగించుకోవాలని వంగరసురేష్ ఆ ప్రకటనలో తెలిపారు.

'అన్నదాతకు అండగా..' విజయవంతం చేద్దాం

మంగళగిరి: ఈ నెల 13వ తేదీ జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద జరగనున్న అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి(డీవీఆర్) బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

తల్లిదండ్రులు పిల్లలతో సమయం గడపాలి

తాడేపల్లిరూరల్: తల్లిదండ్రులు పిల్లలపై బాధ్యతగా వ్యవహరించాలని నవజీవన్ బాలభవన్ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ వసంతకుమారి అన్నారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని యానాదుల కాలనీ (అంబేడ్కర్ కాలనీ) వాసులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతకుమారి మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రతిరోజు పిల్లలతో కనీసం ఒక అరగంట అయినా మాట్లాడాలని సూచించారు. పిల్లలు పాఠశాలలకు వెళ్లకపోయినా, బాల్య వివాహాలు జరుగుతున్నా తమకు తెలియజేయాలని అన్నారు. ఎస్ఎల్ ఆల్ఫోన్స్ రాజు మాట్లాడుతూ పిల్లలపై లైంగికదాడులు జరుగుతున్నాయని, వాటిని నిరోధించాలన్నారు. మన చుట్టూ వున్న పరిస్థితుల ప్రభావం పిల్లలపై ఉంటుందని వివరించారు. ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులు కె.రాంబాబు, కె.రవీంద్రబాబు, ఏఎస్ఎం జయసుధ, ఆశా వర్కర్ విజయలక్ష్మి, డీబీ లెర్నింగ్ సెంటర్ స్కూల్ టీచర్లు రమ్య, పావని, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం



తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కృష్ణాకెనాల్ జంక్షన్ పరిధిలో పాత జాతీయ రహదారి నుంచి బ్రహ్మానందపురం వెళ్లే రహదారిలో వున్న రైల్వే గేటు సమీపంలో రైల్వే పోలీసులు బుధవారం గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహాన్ని గుర్తించారు. గుంటూరు రైల్వే సీఐ అంజిబాబు తెలిపిన వివరాల ప్రకారం రైల్వే ట్రాక్ పక్కన మృతదేహాన్ని గమనించి కీమేన్‌లు సమాచారం అందించారని, సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించగా మృతురాలి తలకు తీవ్ర గాయమైందని, ఆమె వద్ద గుర్తించేందుకు ఎటువంటి ఆధారాలు లభించలేదని, ఆమె వయసు సుమారు 60 నుంచి 65 సంవత్సరాలు ఉండవచ్చని, మృతురాలు కాఫీ రంగు జాకెట్, శనగపిండి రంగు చీర ధరించి ఉందన్నారు. మృతదేహాన్ని గుర్తించినవారు 9010999939, 9328018787, 0863-2220753 నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

సాధన మండలిలో గీతా జయంతి

భట్టిప్రోలు: భట్టిప్రోలు సాధన మండలి బ్రహ్మవిద్యాశ్రమం 50వ వార్షికోత్సవం, గీతా జయంతి మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన కావించి పాదుకలకు అభిషేకాలు, జగద్గురువు శ్రీకృష్ణ పరమాత్మకు అష్టోత్తర శతనామాలతో పూజ, శ్రీమద్భగవద్గీతా పారాయణ, కర్పూర యజ్ఞం శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులకు ఆత్మూరి వెంకట సుబ్బారావు, బూర్లె సుధీర్‌లు ప్రసాదాలు అందజేశారు.

తెగుళ్లతో మిర్చి రైతు కుదేలు!

- ఇప్పటికే వర్షాలతో పంటదెబ్బతిన్న వైనం
- ముసురు వాతావరణంతో విజృంభిస్తున్న తెగుళ్లు
- అధికమవుతున్న పెట్టుబడులు
- అప్పులపాలవుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



నుదురుపాడులో సాగవుతున్న మిర్చి పైరు

బొబ్బర సోకిన మిరప మొక్క

ఫిరంగిపురం: తెగుళ్ల బాధతో మిర్చి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆగష్టు నుంచి ఎడతెరపిలేని వర్షాలు, సరైన వాతావరణం లేక పోవడంతోపాటుగా తెగుళ్లతో దిగుబడి సరిగా లేక మిర్చి రైతులు కుదేలవుతున్నారు. మండలంలోని 18 గ్రామాల్లో 3,500 ఎకరాల్లో రైతులు మిర్చి పంటను సాగుచేస్తున్నారు. దుక్కి దున్నినప్పటినుంచి పూత వచ్చేవరకు కౌలుతో కలుపుకొని రైతులు ఇప్పటివరకు ఎకరాకు రూ. లక్షవరకు ఖర్చుచేశారు.

ఉధృతి అధికం..

ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో వేసిన మిరప పంట పూత దశ, చిన్న కాయ దశలో ఉంది. అయితే ప్రస్తుతం మిర్చికి నల్లతామర, ఎర్రనల్లి, బొబ్బర తెగుళ్లు సోకాయి. అదేవిధంగా కాయలపై బ్యాక్టీరియాతో కూడిన మచ్చతెగులు రావడంతో తాలుకాయగా మారే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. వాతావరణ ప్రభావంతో పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని అంటున్నారు.

పెట్టుబడులు అధికం..

గతేడాది మిరప పంటను కోల్డ్‌స్టోరేజీల్లో పెట్టామని ఇప్పుడు గిట్టుబాటు ధర లేదని దిగాలు చెందుతున్నారు. దానికితోడు ప్రస్తుతం వేసిన పంట దిగుబడి బాగా వస్తుందన్న ఆశతో ఉండగా తెగుళ్లు సోకడంతో దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఎటూ పాలు పోని పరిస్థితి నెలకొంది. ఇప్పటివరకు పెట్టిన పెట్టుబడి కాకుండా మళ్లీ తెగుళ్ల నివారణకు మరికొంత పెట్టుబడి మందులు చల్లేందుకు పెట్టాల్సి వస్తుందని చెబుతున్నారు.

తూతూమంత్రంగా 'పొలం పిలుస్తోంది'

తెగుళ్లు సోకిన పంట దాని నివారణకు వ్యవసాయ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవడంలేదనే అభిప్రాయం రైతులు వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మిర్చిలో తెగుళ్ల నివారణకు సంబంధించిన తగిన సూచనలు అందించడం లేదని రైతులు వాపోతున్నారు. దీంతో గత్యంతరం లేక రైతులు మందుల దుకాణాల వారు చెప్పిన విధంగా రసాయన మందులు పిచికారీ చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు గ్రామాల్లో మిర్చి పంటను పరిశీలించి తెగుళ్ల నివారణకు తగిన సూచనలు చేయాలని కోరుతున్నారు.

- దీనిపై ఏఓ వాసంతిని వివరణ కోరగా పొలం పిలుస్తోంది కార్యక్రమాలు గ్రామాల్లో నిర్వహిస్తూ రైతులకు తగిన సూచనలు అందిస్తున్నామని చెప్పారు.

పెట్టుబడి వచ్చేలా లేదు...



మూడు ఎకరాల్లో మిర్చి పంట సాగుచేశాను. బొబ్బరతెగులు సోకింది. ఇప్పటివరకు రూ.3లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. మళ్లీ అంతే పెట్టుబడి పెట్టాల్సి ఉంది. దిగుబడి సరిగా వచ్చేలా కూడాలేదు. గతేడాది పంటను కూడా కోల్డ్‌స్టోరేజ్‌లో ఉంచాను. ధర తక్కువగా ఉంది. ఇలాఅయితే పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేలా లేదు.

– ఎం.నవీన్‌రెడ్డి, రైతు, నుదురుపాడు

గిట్టు బాటు ధర లేదు..



పది ఎకరాల్లో మిర్చి పంటను సాగుచేశాను. నాలుగు ఎకరాలు సొంతం ఉండగా మిగిలిన ఆరు ఎకరాలు కౌలుకు తీసుకున్నాను. పెట్టుబడి ఇప్పటివరకు రూ.13 లక్షలు అయింది. అప్పు చేసి మరికొంత పెట్టాలంటే తెగుళ్లతో దిగుబడి తక్కువగా వచ్చేలా ఉంది. అంతేకాక ప్రభుత్వం సరైన గిట్టుబాటు ధర కూడా లేదు. కనీసం క్వింటాకు రూ.13వేలు ధరన్నా కల్పిస్తే కొంత వెసులుబాటు ఉంటుంది.

– చేవూరి రామమోహన్‌రెడ్డి, 113 త్యాళ్లూరు

తక్కెళ్లపాడులో రెవెన్యూ సదస్సు



ఫిరంగిపురం: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించినట్లు తహసీల్దార్ జె.ప్రసాదరావు తెలిపారు. అడంగలు, మరియు పట్టాదారు పాసు పుస్తకాలకు సంబంధించి 28 అర్జీలు, భూమి కొలతలకు సంబంధించి 12 అర్జీలు వచ్చినట్లు ఆయన చెప్పారు. మండల ప్రత్యేకాధికారి వి.శంకర్, దేవదాయ శాఖ ఈఓ జె.శ్రీనివాసరావు, రిజిస్ట్రేషన్ శాఖ జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, సర్వేయర్ జి.వెంకటేశ్వర్లు, ఆర్ఐ షేక్.అబ్దుల్ రెహమాన్, వీఆర్వో కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

16 నుంచి శిక్షణ కార్యక్రమాలు

తాడికొండ: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 16 నుంచి 19 వరకు మండల పరిధిలోని గ్రామ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందికి బ్యాచ్‌ల వారీగా శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ కె.సమతావాణి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ శిక్షణా కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె కోరారు.

నైపుణ్యాభివృద్ధితోనే ఉత్తమ ఫలితాలు

వీఐటీ ఏపీలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు ఒక్కరోజు నైపుణ్యాభివృద్ధి శిక్షణ



నైపుణ్యాభివృద్ధి శిక్షణలో పాల్గొన్న ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు

ఐనవోలు(తాడికొండ): మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉపాధ్యాయులు నూతన విద్యా విధానం అలవర్చుకొని విద్యనందించేందుకు తమ నైపుణ్యాలు పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వీఐటీ–ఏపీ వర్సిటీ వీసీ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి అన్నారు. వీఐటీ- ఏపీ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సైన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక్కరోజు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు తమ వర్సిటీ దత్తత గ్రామాలైన శాఖమూరు, వెలగపూడి, ఐనవోలులోని ఐదు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు నైపుణ్యాభివృద్ధి నిమిత్తం ఈ శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రధానంగా గణిత సమస్యలను పరిష్కరించడానికి సాఫ్ట్‌వేర్ వినియోగ సామర్థ్యాలను పెంపొందించడంపై ఉపాధ్యాయులకు శిక్షణ అందించడం వల విద్యార్థుల్లో భౌతిక శాస్త్ర, రసాయన శాస్త్రంలో ప్రయోగాత్మక రూపకల్పన నైపుణ్యాలు మెరుగుపరచడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఏటా స్టార్స్ పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి జిల్లా నుంచి గ్రామీణ ప్రాంతానికి చెందిన ప్రతిభావంతులైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివే ఒక విద్యార్థికి, విద్యార్థినికి ఉచిత విద్యను తమ వర్సిటీ అందిస్తుందన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి మాట్లాడుతూ సామాజిక బాధ్యతలో భాగంగా తమ వీఐటీ– ఏపీ విశ్వ విద్యాలయం ఇలాంటి అనేక కార్యక్రమాలు చేపడుతుందని, వీటి ద్వారా విద్యార్థులకు బోధించే సమయంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయులు నేర్చుకున్న అంశాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. కార్యక్రమ నిర్వహణకు సహకారం అందించిన జిల్లా విద్యాశాఖాధికారి జీవీ రేణుకకు కృతజ్ఞతలు తెలిపారు. డీన్ ఆఫ్ స్కూల్స్ అడ్వాన్స్‌డ్ సైన్సెస్ డాక్టర్ ఎస్.శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ ఎం.ఫణికుమార్ పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నారా లోకేష్ ఇచ్చిన హామీని నెరవేర్చాలి

సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు



దీక్షా శిబిరాన్ని సందర్శించి మాట్లాడుతున్న దుర్గారావు

తాడేపల్లిరూరల్: విద్యాశాఖ మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. బుధవారం బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఏఐఎఫ్‌టీయూ నాయకుడు కె.కోటేశ్వరరావుతో కలసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని, ప్రభుత్వం కూడా ఈ సమస్యపై చొరవ చూపించి కార్మికులను, యాజమాన్యాన్ని కూర్చోబెట్టి సమస్యను పరిష్కరించాలన్నారు. పోరాట కమిటీ కన్వీనర్ కూరపాటి స్టీవెన్, బి.అంకయ్య, ఎం.ఆశీర్వాదం, కె.ఆదినారాయణ, వై.నాగేశ్వరరావు, బి.సూర్యప్రకాష్, ఎస్‌కె బాషా, ఎండీ రహీముల్లా, ఎం.శాస్త్రి, శివకుమారి, రమాదేవి పాల్గొన్నారు.

పాస్టర్లకు నూతన వస్త్రాలు పంపిణీ



పాస్టర్లకు నూతన వస్త్రాలు అందజేస్తున్న కల్వరి కృపా ట్రస్ట్ కార్యదర్శి సిహెచ్ గాంధీ

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని సీతానగరం కల్వరి ప్రార్థనా మందిరంలో బుధవారం పాస్టర్లకు నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంటీఎంసీ పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు టి.రాజేష్ మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినం సందర్భంగా మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పాస్టర్ల ఫెలోషిప్, కల్వరి కృపా ట్రస్ట్ కార్యదర్శి సిహెచ్ గాంధీ ఆధ్వర్యంలో 116 మంది పాస్టర్లకు నూతన వస్త్రాలు అందజేశామని తెలిపారు. సిహెచ్ గాంధీ మాట్లాడుతూ క్రైస్తవులకు చట్టసభల్లో అవకాశం కల్పించాలని రాజకీయ పార్టీలను కోరుతున్నామన్నారు. క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. పాస్టర్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు బి.జగన్‌మోహన్ రావు, వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ ఆశీర్వాదం, కోశాధికారి శ్యామ్ బాబు, విజయకుమార్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

డీఎస్పీ జనార్ధనరావు



మాట్లాడుతున్న డీఎస్పీ జనార్ధనరావు, పక్కన సీఐ రమేష్‌బాబు



విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న దుగ్గిరాల ఎస్ఐ వెంకట్ రవి

తెనాలిరూరల్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ బి. జనార్ధనరావు సూచించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలతో త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు ఆధ్వర్యంలో స్థానిక చెంచుపేటలోని ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద బుధవారం రాత్రి 'వారధి' కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్ నేరగాళ్లు మోసం చేసే విధానం, నేరాలకు పాల్పడేందుకు ఏ విధంగా మోసపూరిత ఫోన్ కాల్స్ ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ మెసేజ్‌లు పంపుతారన్న అంశాలపై షార్ట్ ఫిలింలను ప్రదర్శించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడు తూ ఏ బ్యాంకు, రుణ సంస్థలు ఫోన్ చేసి ఆధార్, పాన్, ఓటీపీలు వంటి వివరాలను అడగవని, అటువంటివి అడిగితే ఖచ్చితంగా సైబర్ నేరగాళ్లేనని గుర్తించాలన్నారు. సెల్‌ఫోన్‌కు వచ్చే ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ మెసేజ్‌లలో ఉండే లింక్‌లను క్లిక్ చేయకూడదన్నారు. ఏటీఎం కేంద్రాల వద్ద కేటుగాళ్లు మోసాలకు పాల్పడతారని, అపరిచిత వ్యక్తు లను నగదు డ్రా చేయమని కోరవద్దని చెప్పారు. సైబర్ కేటుగాళ్ల బారిన పడి లక్షల్లో నగదు పోగొట్టుకున్న బాధితులు తెనాలిలో ఉన్నారని చెబుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీసు వేషధారణలో వీడియోకల్ చేసి మీ పేరిట లేదా మీ పిల్లల పేరిట విదేశాల నుండి కొరియర్ వచ్చిందని, అందులో నిషేధిత మాదకద్రవ్యాలు ఉన్నాయంటూ ఎటూ కదలకూడని ఆజ్ఞాపిస్తారని, అటువంటి సందర్భం ఎదురైతే కాలల్‌ను వెంటనే కట్‌చేసి సమీపంలోని పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. డిజిటల్ అరెస్ట్ పేరిట జరుగుతున్న మోసాలపై మరింత అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచిత వ్యక్తులకు ఆధార్, పాన్ వివరాలు, ఓటీపీలు చెప్పకూడదని సూచించారు. కార్యక్రమంలో త్రీ టౌన్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాలలోని డాక్టర్ కె.ఆర్.ఆర్. ఎం.డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దుగ్గిరాల ఎస్ఐ వెంకట్ రవి మాట్లాడుతూ అపరచిత వ్యక్తులకు ఫోన్ నెంబర్లు, ఈ–మెయిల్ ఐడీ, ఓటీపీలు ఇవ్వవద్దని వాట్సాప్‌కు వచ్చే అపరిచిత లింకులకు, మెసేజ్‌లకు జవాబు ఇవ్వకూడదని వివరించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి లోన్‌ను ఇస్తామని, క్రెడిట్ కార్డు సదుపాయం కల్పిస్తామని, మీ ఫోన్‌కు ఓటీపీ వచ్చింది చెప్పమని అడుగుతారని అటువంటి వారికి సమాధానం ఇవ్వవద్దని సూచించారు. ప్రతి విషయాన్ని తల్లిదండ్రులతో చర్చించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. గిరిధరరావు, ఎన్ఎస్ఎస్ అధికారి బి.రాంబాబు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ఎన్‌సీసీ విస్తృతస్థాయి సమావేశం



ఎన్‌సీసీ అధికారులతో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎస్.మధుసూదన రెడ్డి

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో బుధవారం ఎన్‌సీసీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమాండర్ పి.మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాల గురించి, ఎన్‌సీసీ ఆవశ్యకత గురించి వివరించారు. ఎన్‌సీసీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ సంజీవ్ గుప్త, రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ అధికారులు, పలు పాఠశాలలు, కళాశాలల నుంచి అసోసియేట్ ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.కేఎల్ యూనివర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, డాక్టర్ హబీబుల్లా ఖాన్ పాల్గొన్నారు.

కాల్వలు ప్రతిరోజు బాగు చేయించేలా చూడండి

31వ వార్డులో పర్యటించిన మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



స్థానికుల సమస్యలు వింటున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: ప్రతిరోజు మురుగు కాల్వలను బాగు చేయకపోవడం వలన దుర్గంధభరితంగా మారుతున్నాయని, వాటిని బాగు చేయించే విధంగా చూడాలని 31వ వార్డు ప్రజలు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికను కోరారు. 31వ వార్డులో బుధవారం ఆమె పర్యటించారు. వార్డులోని మురుగు కాల్వలను పరిశీలించి పలు సూచనలు చేశారు. వీధి దీపాలను ఏర్పాటు చేయాలని మరికొందరూ కోరారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను పరిష్కరించే విధంగా చూస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఆమె వెంట ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఏఈ సునీల్‌కుమార్, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నగదు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం

సాక్షి ఎఫెక్ట్



మాట్లాడుతున్న మెప్మా పీడీ వి.విజయలక్ష్మి

తెనాలిఅర్బన్: సర్వేల పేరిట మహిళల నుంచి నగదు వసూ లు చేస్తే సహించేది లేదని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మెప్మా గుంటూరు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయలక్ష్మి హెచ్చరించారు. ఈ నెల 6వ తేదీన సాక్షి దినపత్రికలో సర్వే పేరిట ఆర్పీల దందా శీర్షికన కథనం వెలువడిన విషయం తెలిసిందే. బుధవారం తెనాలి వచ్చిన ఆమె మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మెప్మా ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. సాక్షిలో వచ్చిన కథనంపై ఆరా తీశారు. మరోసారి అలాంటి ఆరోపణలు రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సర్వేను ఈ నెల 15 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. చిన్నతరహా వ్యాపారాలు చేసుకునే వారి వివరాలను కూడా త్వరగా సేకరించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం వివిధ అంశాలపై ఆమె సమీక్ష జరిపారు. సమావేశంలో మెప్మా అధికారి జె.రవికాంత్ పాల్గొన్నారు.

కేరళ రాష్ట్రంపై బీజేపీ వివక్ష మానుకోవాలి

రేపల్లె రూరల్: కేరళ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం చూపుతున్న వివక్ష మానుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ డిమాండ్ చేశారు. కేరళ రాష్ట్రంకు సంఘీభావంగా బుధవారం సాయంత్రం సీపీఎం కార్యాలయంలో పలు ప్రజా సంఘాల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేరళ రాష్ట్ర ప్రజలకు ప్రజా తంత్రవాదులు, ప్రజలు అండగా నిలవాలన్నారు. కేరళ ప్రజల హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీజేపీ పాలన లేని రాష్ట్రాలను శాసిస్తూ తన ఆధీనంలోకి తెచ్చుకునేందుకు కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. కేరళలో సీపీఎం నాయకత్వంలో ఉన్న వామపక్ష ప్రభుత్వానికి అనేక ఆటంకాలు, అడ్డంకులు కల్పించి న్యాయపరంగా రావాల్సిన నిధులను రాకుండా అడ్డగిస్తోందన్నారు. రాష్ట్ర సంక్షేమానికి అప్పులు చేయటానికి అనుమతులు సైతం నిరాకరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఇప్పటికైనా బీజేపీ కేరళ రాష్ట్రంపై కక్షపూరిత రాజకీయాలను మానుకోవాలన్నారు. సమావేశంలో పలు ప్రజా సంఘాల నాయకులు కేవీ లక్ష్మణరావు, గోపి,కె.ఝాన్సీ, కె.సాయిప్రసాద్, జే ధర్మరాజు, కృష్ణప్రసాద్, ఎం.సూర్యప్రకాష్, కే నవీన్ పాల్గొన్నారు.

వైభవంగా గీతా రథయాత్ర

తెనాలి: గీతాజయంతి సందర్భంగా బుధవారం పట్టణంలో వైభవంగా గీతా రథయాత్రను నిర్వహించారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని కోదండరామాలయం నుండి గోవర్ధన స్వామి ఆలయం వరకు గీతా రథయాత్ర సాగింది. సీతారాములతో లక్ష్మణుడు, ఆంజనేయుడు, శ్రీకృష్ణ భగవాన్ విగ్రహాలను అలంకరించి ఊరేగించారు. భజరంగదళ్, తెనాలిశాఖ, విశ్వ హిందుపరిషత్, హిందూ చైతన్యవేదిక కార్యకర్తలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. త్రిదండి చినజీయర్ స్వామి శిష్యుడు నరేంద్రస్వామి హారతిచ్చి రథయాత్రను ప్రారంభించారు. అవ్వారు శ్రీనివాసరావు, అంబటి మారుతివరప్రసాద్, పాట్టి మూర్తి, శ్రీనివాసరావు పర్యవేక్షించారు. రామాంజనేయులు, శేఖర మూర్తి, చరణ్ ,రమాదేవి, శారద, విజయలక్ష్మి, వేదశ్రీ తదితరులు పాల్గొన్నారు. గోవర్ధనస్వామి దేవాలయానికి చేరుకున్న రథయాత్రకు అర్చకులు ఘనస్వాగతం పలికారు. హారతులిచ్చి పూజలు నిర్వహించారు. ప్రసాద వితరణ చేశారు.